## క్లుప్తంగా

### ఆళ్ల నానికి శెట్టిబలిజ సంఘం మద్దతు



ఎమ్మెల్యే నానిని కలిసిన శెట్టిబలిజ సంక్షేమ సంఘం నేతలు

ఏలూరు టౌన్‌: ఏలూరు శ్రీరామ్‌నగర్‌ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆళ్ల నానిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న నానికి వారి మద్దతు ప్రకటించారు. పేదలకు మంచి చేసే నాయకుడినే ప్రజలకు సూచించారు. వీరిలో ఏలూరు శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు పితాని గంగాధరరావు, ప్రధాన కార్యదర్శి ఇల్లా వరప్రసాద్‌, గౌరవాధ్యక్షుడు వి.విజయ నర్సింహారావు, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వసాది శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కట్టా జయప్రకాష్‌నారాయణ తదితరులు ఉన్నారు.

### ప్రశాంతంగా పోస్టల్‌ బ్యాలెట్‌ పోలింగ్‌



పోస్టల్‌ బ్యాలెట్‌ పోలింగ్‌ కేంద్రంలో పరిశీలిస్తున్న ఆర్వో ముక్కంటి, నగర కమిషనర్‌ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్‌: ఏలూరు వన్‌టౌన్‌ కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో పోస్టల్‌ బ్యాలెట్‌ ఫెసిలిటేషన్‌ కేంద్రాల వద్ద పోలింగ్‌ ప్రశాంతంగా కొనసాగుతుందని ఏలూరు నియోజకవర్గం ఎన్నికల రిట్నరింగ్‌ అధికారి ముక్కంటి తెలిపారు. ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు హెల్ప్‌ డెస్కులు ఏర్పాటు చేశామని చెప్పారు. మినీ వైద్య శిబిరం, తాగునీరు, షామియానా టెంట్లు, కుర్చీలు, కూలర్లు సైతం ఏర్పాటు చేశామని తెలిపారు. ముక్కంటితోపాటు ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్‌ సంక్రాంతి వెంకటకృష్ణ కేంద్రంలోనే ఉంటూ పోలింగ్‌ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి ఏలూరు నియోజకవర్గంలో 1949 మంది ఓటర్లకు 1867 మంది తమ పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నట్టు చెప్పారు. జిల్లా పరిధిలో ఏలూరులో 376 మందికి 355 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఇతర జిల్లాలకు చెందిన వారు 551 మందికి 334 మంది ఓటు వేశారని చెప్పారు.

### రేపు బసవ జయంతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన శ్రీ బసవేశ్వర కర్ణభక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న శ్రీ బసవ జయంతి, సంఘ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్టు ఆ సంఘ ప్రతినిధులు తెలిపారు.

# టీడీపీ హామీపై ఆటోడ్రైవర్ల ఆందోళన

- ఉచిత బస్సుతో మా కడుపు కొడతారా?
- చంద్రబాబు తీరుపై తీవ్ర ఆగ్రహం





వాహనమిత్ర కార్యక్రమంలో సీఎం జగన్‌తో ఆటోడ్రైవర్లు, చిత్రంలో ఎమ్మెల్యే నాని, ఏలూరులో ఆటో డ్రైవర్లు (ఫైల్‌)

ఏలూరు టౌన్‌: నేడు : ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ ప్రజాసంకల్ప పాదయాత్రలో ఆటో డ్రైవర్ల కష్టాలను తెలుసుకున్నారు. ఏలూరు జిల్లాలోనే ఆయన ఆటో డ్రైవర్లకు అండగా ఉంటానంటూ హామీ ఇచ్చారు. 2019లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తన హామీని అమలు చేస్తూ ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేలు అందజేశారు. ఆటో ఫిట్‌నెస్‌, నిర్వహణకు అండగా నిలబడుతూ ఆర్థిక భరోసా కల్పించారు. ఈ ఐదేళ్ల పాటు ఆటో డ్రైవర్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ భరోసా ఇచ్చింది.

నాడు : చంద్రబాబు హయాంలో ఏనాడు కార్మికుల కష్టాలపై ఆలోచన చేసిన దాఖలాలు లేవనే చెప్పాలి. పైగా 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు హయాంలో ఇష్టారాజ్యంగా ఆటోవాలాల తాటతీసేలా ఫైన్లు వేస్తూ, పన్నులు చెల్లించేందుకు ఇబ్బందులు పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. తాజాగా చంద్రబాబు 2024 ఎన్నికల నేపథ్యంలో ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని మేనిఫెస్టోలో పెట్టటంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒకవైపు తెలంగాణలో ఆటోడ్రైవర్ల కష్టాలు చూస్తూనే, ఉపాధి కరువై కుటుంబాలను పోషించుకోలేక, అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి.

**ఓటు రాజకీయంతో కష్టాలు**

ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు తన రాజకీయ భవిష్యత్‌ తప్ప సాధారణ ప్రజలు, కార్మికుల కష్టాలపై శ్రద్ధపెట్టే పరిస్థితులు లేవనే చెప్పాలి. ముఖ్యమంత్రి పదవి కోసం అలవికాని హామీలు గుప్పిస్తూ సామాన్యుల నడ్డివిరిచే హామీలు ఇవ్వటంలో చంద్రబాబు దిట్ట. 2014లోనూ రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ చేస్తానని నమ్మబలికి మహిళలు, రైతన్నలను దారుణంగా నట్టేట ముంచిన చరిత్ర చంద్రబాబుకు ఉందనే అభిప్రాయం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఓట్లు వేయించుకోవటమే ధ్యేయంగా రాజకీయాలు చేయటం తప్ప ప్రజల జీవనప్రమాణాలు పెంచేలా, పేదలను ఆదుకునేలా ఏనాడు హామీలు లేవని విమర్శిస్తున్నారు.

**ఆటోవాలాల ఉపాధిపై పిడుగు**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీతో ఆటోడ్రైవర్ల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఆటోవాలాల ఉపాధిని దెబ్బతీసేలా చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏలూరు నియోజకవర్గంలో సుమారుగా ఏడు వేలు నుంచి తొమ్మిది వేలు వరకు ఆటోలు ఉన్నట్టు చెబుతున్నారు. ఇక ఏలూరు పరిసర ప్రాంతాలు, ఏలూరు జిల్లా కేంద్రానికి వచ్చిపోయేవి చూస్తే 12 వేలకు పైగా ఉంటాయని అంచనా. ఇలాంటి పరిస్థితుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఆటోడ్రైవర్ల ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని వారంతా ఆందోళన చెందుతున్నారు. కనీసం సగానికి పైగా ఆటోడ్రైవర్లు ఉపాధి లేక రోడ్డున పడే పరిస్థితులు ఏర్పడతాయనే భయం వారిలో నెలకొంది.

### ఉపాధి కోల్పోయే పరిస్థితి



ఎన్నికల సందర్భంగా చంద్రబాబు మేనిఫెస్టోలో పెట్టిన ఆర్‌టీసీ బస్సు ఉచిత ప్రయాణంతో ఆటోడ్రైవర్లకు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ఏలూరు పరిసర ప్రాంతాలు, నగరంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రజలు ఆటోలు ఎక్కుతారు. రోజువారీగా మా కుటుంబాలు పోషించుకోవటానికి సంపాదించుకుంటున్నాం. ఇప్పుడు చంద్రబాబు నిర్ణయంతో ఏమి జరుగుతుందో అనే భయం ఏర్పడింది.

– నాగభూషణం, ఆటోడ్రైవర్‌, ఏలూరు

### ఉచిత బస్సు.. ఉసురు తీస్తుందేమో



తెలంగాణ రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణం హామీ వల్ల ఎంతోమంది ఆటోడ్రైవర్ల కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రోజంతా ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాం. రాజకీయ పార్టీల సంగతి పక్కన పెడితే ఇలాంటి నిర్ణయాలతో మాలాంటి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడడం మాత్రం ఖాయం.

– సత్యనారాయణ, ఆటోడ్రైవర్‌, ఏలూరు

### ఆటోవాలాలకు న్యాయం చేయాలి



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం మంచిదే. ఇదే సమయంలో ఆటో డ్రైవర్ల కుటుంబాల జీవనం గురించీ ఆలోచించాలి కదా. సీఎం జగన్‌ ఆటో, కారు డ్రైవర్లకే కాకుండా ఈసారి టిప్పర్‌ డ్రైవర్లకు సైతం వాహన మిత్ర పథకం అమలు చేస్తామని చెప్పారు. ఆటోడ్రైవర్ల ఉపాధికి చంద్రబాబు ఏమి చేస్తారో చెప్పాలి.

– శ్రీనివాస్‌, ఆటోడ్రైవర్‌, ఏలూరు

# గూండాగిరీ.. దౌర్జన్యాలకు చెక్‌ పెడతా

- ఏలూరు సమగ్రాభివృద్ధే మన లక్ష్యం
- ఎమ్మెల్యే ఆళ్ల నాని
- 6, 7, 8, 9, 13, 14 డివిజన్లలో ఎన్నికల ప్రచారం
- వన్‌టౌన్‌లో వెల్లువెత్తిన ప్రజాభిమానం



ప్రచారానికి హాజరైన ఏలూరు ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు



వన్‌టౌన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, చిత్రంలో మేయర్‌ నూర్జహాన్‌

ఏలూరు టౌన్‌: గూండాగిరీ, దౌర్జన్యాలకు చెక్‌ పెట్టి, ప్రజలు తమ కుటుంబాలతో సంతోషంగా జీవించేలా ఏలూరు నగరాన్ని తీర్చిదిద్దటమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. బుధవారం రాత్రి ఆయన ఏలూరు వన్‌టౌన్‌ ప్రాంతంలోని 6, 7, 8, 9, 13, 14 డివిజన్లలో ఎన్నికల ప్రచారం చేశారు. తూర్పువీధి ఫల్‌హౌస్‌ పేటలోని దివంగత మహానేత డాక్టర్‌ వైఎస్సార్‌ విగ్రహం వద్ద, పోణంగి గ్రామం సభలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు హాజరయ్యారు. అడుగడుగునా ఆయనకు ప్రజలు హారతులు పట్టారు. గజమాలలు వేస్తూ.. అపూర్వ స్వాగతం పలికారు. వెల్లువెత్తిన ప్రజాభిమానం, పూలవర్షంలో ఎమ్మెల్యే నాని తడిసి ముద్దయ్యారు. సభా ప్రాంగణాల వద్ద నానికి వైఎస్సార్‌ సీపీ కార్పొరేటర్లు సుంకర చంద్రశేఖర్‌, పిల్లంగోళ్ల శ్రీదేవి, వంకదారు ప్రవీణ్‌, సబ్బన శ్రీనివాస్‌, నిడికొండ అన్నపూర్ణ, యువజన అధ్యక్షులు నిడికొండ నరేంద్ర, దారపు అనూష, పార్టీ నాయకులు దారపు తేజ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. వన్‌టౌన్‌, పోణంగిలో చేపట్టిన సభల్లో నాని మాట్లాడుతూ అవినీతి, అక్రమాలు లేకుండా పారదర్శకమైన పాలన అందిస్తూ ప్రజలకు నేరుగా ప్రభుత్వ సేవలు అందించేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి వస్తున్నారని, ఏలూరులోనూ, జిల్లాలోనూ ఎగిరేది వైఎస్సార్‌ సీపీ జెండానే అంటూ ధీమా వ్యక్తం చేశారు. కుల,మత, రాజీయాలకు అతీతంగా పేదరికమే కొలమానంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫ్యాన్‌ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్సార్‌ సీపీకి విజయాన్ని అందించాలని కోరారు.

**మోసపూరిత వాగ్దానాలు నమ్మొద్దు**

ఏలూరు నగర మేయర్‌ షేక్‌ నూర్జహాన్‌ మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఆళ్ల నాని, కారుమూరి సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. చంద్రబాబు కూటమి మోసపూరిత వాగ్దానాలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. ఎన్నికల్లో ఫ్యాన్‌ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో ఏపీ సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్‌ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఇడా చైర్మన్‌, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్‌, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్‌ సభ్యులు ఎస్‌ఎంఆర్‌ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్‌, ఏఎంసీ చైర్మన్‌ నెరుసు చిరంజీవులు, ఏఎంసీ మాజీ చైర్మన్‌ మంచెం మైబాబు, ఏపీ హిస్టరీ అకాడమీ డైరెక్టర్‌ మహ్మద్‌ ఖైసర్‌, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు ఉన్నారు.

### నేటి నుంచి శ్రీవారి వైశాఖ బ్రహ్మోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 9 నుంచి శ్రీవారి పంచ త్రింశతి (35)వ వార్షిక వైశాఖ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం ఉత్సవాలు ప్రారంభమౌతాయని, స్వామి వారిని అశ్వవాహనంపై పెండ్లి కుమారుడిని చేస్తారని, 10వ తేదీన ప్రధాన కుంభ స్థాపన, గరుడ ధ్వజారోహణ, సాయంత్రం శ్రీవారికి సింహవాహన సేవ నిర్వహిస్తారని పేర్కొన్నారు. 11న ఉదయం సంతాన గోపాలేష్టి, సాయంత్రం శ్రీవారి తరుకల్యాణ మహోత్సవం, 12న ఉదయం తిరుమంజన సేవ, శ్రీ సుదర్శన నారసింహేష్టి, సాయంత్రం గరుడ వాహన సేవ, 13న ఉదయం శ్రీ హయగ్రీవేష్టి, సాయంత్రం గజవాహన సేవ, 14న మహాపూర్ణాహుతి, సాయంత్రం చిన్న గరుడ వాహన సేవ, ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగం, శయనోత్సవం నిర్వహిస్తారని తెలిపారు.

### క్రమశిక్షణతో విద్యను అభ్యసించండి

ఏలూరు (టూటౌన్‌): వసతి గృహంలోని బాలురు క్రమశిక్షణతో ఉన్నతమైన విద్యను అభ్యసించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్‌ అన్నారు. స్థానిక శనివారపుపేటలోని ప్రభుత్వ వసతి గృహాన్ని బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలన్నారు. వసతి గృహంలో సౌకర్యాలపై బాలురను అడిగి తెలుసుకున్నారు. గత విద్యాసంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అవసరమైన వారికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా న్యాయ సహాయం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వసతి గృహం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యుత్‌ సరఫరా పునరుద్ధరణ



కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న ఏఈ రామస్వామి, సిబ్బంది

భీమడోలు: ఈదురుగాలులతో ధ్వంసమైన విద్యుత్‌ స్తంభాలను బుధవారం తొలగించి నూతన స్తంభాలను విద్యుత్‌ శాఖ అధికారులు ఏర్పాటు చేసి బుధవారం గ్రామాల్లో విద్యుత్‌ సరఫరాను పునరుద్ధరించారు. మంగళవారం భారీ ఈదురు గాలులకు పలు గ్రామాల్లో విద్యుత్‌ స్తంభాలు కూలిపోయాయి. గుండుగొలనులో ఓ ఇంటిపై పడిన విద్యుత్‌ స్తంభాన్ని తొలగించి అక్కడ కొత్త విద్యుత్‌ స్తంభాన్ని ఏర్పాటు చేసారు. గుండుగొలను, ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం, పూళ్ల గ్రామాల్లో 17 విద్యుత్‌ స్తంభాలు దెబ్బతినడంతో వాటి స్థానంలో వాటిని ఏర్పాటు చేసి విద్యుత్‌ అంతరాయం ఏర్పడకుండా అన్ని గ్రామాల్లో విద్యుత్‌ సరఫరా చేసామని ఏఈ పి.రామస్వామి తెలిపారు. భీమడోలు సబ్‌ డివిజన్‌ పరిధిలో ఎం.నాగులపల్లి, మారంపల్లి, మహాదేవపురం, గుండుగొలను, ఆగడాలలంక గ్రామాల్లో విద్యుత్‌ సరఫరా పునరుద్ధరించామని ఏడీఏ కె.గోపాలకృష్ణ తెలిపారు. తెగపడిన విద్యుత్‌ వైర్లును బిగించడం, కొత్త వైర్లు వేయడం తదితర సమస్యలను పరిష్కరించామని ఏడీఏ తెలిపారు. మంచినీటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.

### 2,356 మంది ఓటు హక్కు వినియోగం

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో మూడు రోజులుగా పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా 2,356 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని జేసీ, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి బీ లావణ్యవేణి అన్నారు. దెందులూరు ఆర్వో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఏలూరు సీఆర్‌ఆర్‌ మహిళా కళాశాల పీజీ బ్లాక్‌లో బుధవారం 150 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. 9వ తేదీన దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సిబ్బంది పోస్టల్‌ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఈవీఎం కమిషనింగ్‌ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు.

**కొనసాగిన పోస్టల్‌ బ్యాలెట్‌**

ఉంగుటూరు: పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటు బుధవారం 91 మంది వేశారు. ఇప్పటివరకు 1,553మంది ఉద్యోగులు పోస్టల్‌ బ్యాలెట్‌ వేయగా మరో 107 మంది విద్యుత్‌ శాఖ, ఆర్టీ సీ, తదితర అత్యవసర డిపార్టుమెంట్లకు చెంది న ఉద్యోగులు పోస్టల్‌ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఆర్వో ఖాజావలి పర్యవేక్షించారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 26 | అరటి కాయ (1) | 05-07 |
| వంకాయలు (గులాబీ) | 34 | చిక్కుడు కాయలు | 94 |
| వంకాయలు (కాంతులు) | 38 | చామదుంపలు | 48 |
| వంకాయలు (తెలుపు) | 24 | ములక్కాడలు | 04-06 |
| బెండకాయలు | 30 | కంద | 68 |
| పచ్చిమిర్చి | 60 | బీట్‌రూట్‌ | 36 |
| కాకర కాయలు | 34 | కీరా దోస | 40 |
| బీరకాయలు | 34 | ఫ్రెంచ్‌బీన్స్‌ | 180 |
| బీరకాయలు (పందిరి) | 50 | అల్లం | 170 |
| క్యాబేజీ | 32 | కొత్తిమీర (కట్ట) | 25 |
| క్యారెట్‌ | 34-48 | పాలకూర | 12 |
| దొండకాయలు | 34 | చుక్కకూర | 12 |
| బంగాళదుంపలు | 34 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 28 | గోంగూర | 07 |
| గోరుచిక్కుడు | 46 | పుదీనా | 05 |
| దోసకాయలు | 22 | బఠాణి | -- |
| అనబకాయ (1) | 15-20 | క్యాప్సికమ్‌ | 70 |
| పొట్లకాయ(1) | 15-20 | చిలకదదుంప | 38 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్‌ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ | 21.00 | 26 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్‌ (అమరావతి) | 22.30 | 37 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్‌ (అమరావతి) | 22.00 | 44 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 28 |

**సూపర్‌ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్‌ నంబర్‌ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ | 21.45 | 4820 | 31 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ | 21.15 | 4822 | 29 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా కే.కోట | 19.30 | 4796 | 31 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 26 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం | 20.30 | 4800 | 30 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ | 20.15 | 4802 | 27 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం | 21.00 | 4804 | 30 |
| ఏలూరు -ఈసీఐఎల్‌ | 22.30 | 4814 | 29 |
| ఏలూరు -తిరుపతి | 16.00 | 4830 | 33 |

# సీఎం జగన్‌ను ఆశీర్వదిద్దాం



50వ డివిజన్‌లో మాట్లాడుతున్న కోఆప్షన్‌ సభ్యుడు పెదబాబు



35వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న డిప్యూటీ మేయర్‌ గుడిదేశి శ్రీనివాస్‌ భార్య లక్ష్మీశారద



46వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ముస్లిం మైనార్టీ నగర అధ్యక్షుడు రియాజ్‌ ఆలీఖాన్‌, మున్నా

ఏలూరు టౌన్‌: పేదల పక్షపాతిగా పేరుతెచ్చుకున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ప్రజలంతా ఆశీర్వదించాలని ఏలూరు కోఆప్షన్‌ సభ్యుడు ఎస్‌ఎంఆర్‌ పెదబాబు కోరారు. ఏలూరు 50వ డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రజలు ఓటు ఏవిధంగా వేయాలో అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఏలూరు నగర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఫ్యాన్‌ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని పెదబాబు కోరారు. ప్రచారంలో ఏఎంసీ మాజీ చైర్మన్‌ మంచెం మైబాబు, పార్టీ నాయకులు ఉన్నారు.

- 35వ డివిజన్‌లో గూనాపువారి వీధి, ఈదుపల్లి వారివీధి, ఉడవల వారిసెంటర్‌, విమలాదేవి స్కూల్‌ ప్రాంతాల్లో నగర డిప్యూటీ మేయర్‌ గుడిదేశి శ్రీనివాసరావు భార్య గుడిదేశి లక్ష్మీశారద ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్‌ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యే నానిని గెలిపించి, మరోసారి ఏలూరు నగర అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గమిడి శారద, సామంతుల సింహాచలం, మీసాల రవణమ్మ, వీర్ణాల దుర్గ, బోరా సూర్యకాంతం, కోరాడ ధనలక్ష్మి, సింగారపు పద్మ తదితరులు ఉన్నారు.
- 46వ డివిజన్‌లో ఏలూరు నగర ముస్లిం మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు రియాజ్‌ ఆలీఖాన్‌, పార్టీ నాయకురాలు మున్నా ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. మహిళల ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్‌ జగనన్న చేసిన సంక్షేమ పథకాలు మర్చిపోవద్దని, డబ్బులు కోసం భవిష్యత్‌ను వదులుకోవద్దని కోరారు. సీఎం జగనన్న మరోసారి అధికారంలోకి వస్తే పేద వర్గాలన్నీ సంతోషంగా ఉంటాయని వివరించారు.

### 'చంద్రబాబును నమ్మి ఓటేస్తే ముంచేస్తారు'

ద్వారకాతిరుమల: దగా, మోసం, వంచనకు కేరాఫ్‌ అడ్రస్‌ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అని, బాబును నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచేస్తారని రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్‌ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత ప్రజలను హెచ్చరించారు. ద్వారకాతిరుమల మండలం మలసానికుంట, జాజులకుంట, రాజుపాలెం, తిరుమలంపాలెం గ్రామాల్లో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వనితకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. మలసానికుంట గ్రామంలో ఉపాధి కూలీలతో ఆమె కాసేపు ముచ్చటించారు. అనంతరం ప్రచారంలో ఆమె మాట్లాడుతూ అధికారం కోసం చంద్రబాబు ఎంతకైనా దిగజారుతారని ఆరోపించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పోటీ చేశాయని, అప్పట్లో చంద్రబాబు 600కు పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని చెప్పారు. గెలిచిన తర్వాత వాటిలో ఏ ఒక్క హామీని అమలు చేయలేదని గుర్తుచేశారు. 2024 ఎన్నికల టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో అమలు సాధ్యం కాదని గ్రహించిన బీజేపీ నాయకులు ఆ కాపీలను ముట్టుకోవడానికి ఇష్టపడటం లేదన్నారు.

### జీవ వైవిధ్యాన్ని పరిరక్షించుకోవాలి



జీవ వైవిధ్యంపై అవగాహన కలిగిస్తున్న స్వప్న

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భూతలంపై అంతరించిపోతున్న జీవ వైవిధ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సిటీ నేచర్‌ ఛాలెంజ్‌ ఆర్గనైజర్‌ సీహెచ్‌ స్వప్న పిలుపునిచ్చారు. నగరంలోని సీఆర్‌ఆర్‌ మహిళా కళాశాల తరపున స్వప్న 9వ వార్షిక సిటీ నేచర్‌ ఛాలెంజ్‌ కార్యక్రమానికి ఆర్గనైజర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని పరిరక్షించుకోవడానికి ముఖ్యంగా విద్యార్థులు యువత భాగస్వాములు కావాలని సూచించారు. నగరంలోని సీఆర్‌ఆర్‌ మహిళా కళాశాల, సీఆర్‌ఆర్‌ పబ్లిక్‌ స్కూల్‌లో విద్యార్థుల్లో అవగాహన కల్పించామన్నారు. విద్యార్థులు తమ చుట్టుపక్కల పరిసరాల ఫొటోలు తీసి ఇనాచ్యురలిస్ట్‌ యాప్‌ ద్వారా అప్‌లోడ్‌ చేయవచ్చని తెలిపారు. ఈ యాప్‌లో ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో 10,968 ఫొటోలు అప్‌లోడ్‌ కాగా, వీటిలో 8,828 ఫొటోలు ఒక్క ఏలూరు జిల్లా నుంచే అప్‌లోడ్‌ కావడం ఇక్కడి విద్యార్థులు, యువతలో వచ్చిన చైతన్యానికి నిదర్శనమని చెప్పారు. కాగా సిటీ నేచర్‌ ఛాలెంజ్‌–2024లో రాష్ట్ర స్థాయిలో ఏలూరు జిల్లాకు 4వ ర్యాంకు, జాతీయ స్థాయిలో రాష్ట్రానికి 6వ ర్యాంకు, అంతర్జాతీయ స్థాయిలో భారత దేశానికి 72వ ర్యాంకు లభించిందని తెలిపారు.